వైఎస్ఆర్ కడప
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 27 మార్చి 2026



### అంకురార్పణతో
## శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



4వ పేజీలో

## జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప, మార్చి 26 ప్రభాతవార్త**

"పచ్చుటి పందిళ్లు, మామిడాకు తోరణాలు, బంతి పూల దండలు.. శుభ శకునాలకు సంకేతాలు. రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలన, సంక్షేమ పథకాల ఫలాలతో ప్రతి ఇంటా నిత్యకళ్యాణం.. పచ్చతోరణాలతో రాష్ట్రం శ్రీరామరాజ్యాన్ని తలపిస్తోందని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్తస్థాయిలో అందడంతో.. తెలుగు నేలపై.. ప్రతి గుమ్మం ముందూ పచ్చ తోరణాలు శ్రీరామ జయంతి వేడుకలను స్వాగతం పలుకుతున్నాయన్నారు. కుటుంబ జీవన గమనంలో.. కష్ట సుఖాలు సహజమే అనే సత్యానికి.. సీతారాముల ఆదర్శ జీవిత సారాంశమే నిదర్శనం అన్నారు. వారి వైవాహిక జీవితంలో ప్రతీ ఘట్టం భవిష్య తరాలకు ఆదర్శం కావాలని, రామరాజ్యాన్ని తలపిస్తున్న రాష్ట్ర పరిపాలనలో అందరికీ అందరికీ శ్రీ రామరక్ష ఉండాలని కోరుకుంటూ.. జిల్లా ప్రజలకి శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# గనులు, క్వారీల నిర్వహణపై దృష్టి సారించాలి





**కడప, మార్చి 26 ప్రభాతవార్త :**

జిల్లా ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న గనులు, క్వారీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మైనింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లాలో మైనింగ్ క్వారీల నిర్వహణ, ప్రధాన ఖనిజ బ్లాకుల కార్యాచరణ, భూ షెడ్యూల్/వర్గీకరణ/కడాస్ట్రల్ ప్రత్యేకతలతో పాటు రెవెన్యూ వివిధిల సమస్యలు తదితర అంశాలపై జేసీ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన లతో కలిసి సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, వాటిని జిల్లా ఆర్థిక వనరుగా సద్వినియోగం చేసుకోవడంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులపై ఉందన్నారు. అందులో భాగంగా జిల్లాలోని గనుల నిర్వహణ పనితీరుపై సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్ని గనులు నిర్వహణలో ఉన్నాయి..? నిర్వహణలో ఉన్న అన్ని క్వారీలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా..? నిబంధనలకు లోబడి నిర్వహణలో ఉన్నాయా..? అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పటిస్తున్నారా..? సామాజిక బాధ్యత, వార్షిక రాబడి, ఆదాయం తదితర అంశాలపై సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. మైన్స్, క్వారీలకు సంబంధించి.. పెండింగ్‌లో ఉన్న వాటికి టెండర్ నోటిఫికేషన్ ఇవ్వాలని, రెవెన్యూ, పర్యావరణ, అటవీ సంబంధిత పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కారంకు చర్యలు చేపట్టాలన్నారు. అడిటింగ్ రిపోర్ట్ కూడా విధిగా అందజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య మైన్స్ డిడి సుబ్రమణ్యం, మైన్స్, పర్యావరణ, అటవీ, విజిలెన్స్, రెవెన్యూ సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్య మీది పరిష్కారం మాది

### ఇంటింటికి తెలుగుదేశంలో జగన్ రాజు



ఈడిగపాలెంలో డ్రైనేజ్ సమస్యను పరిశీలిస్తున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, మార్చి26 ప్రభాతవార్త**

సమస్య మీది పరిష్కారం మాదంటూ టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్రాజు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. గురువారం ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఈడిగపాలెం లో ఆయన పార్టీ నాయకులు అధికారులతో కలిసి పర్యటించారు. చెత్త సక్రమంగా తరలించడం లేదని, డ్రైనేజ్ సమస్య ఎక్కువగా ఉందని, నీటి సమస్య కూడా ఉందని స్థానికులు జగన్మోహన్ రాజుకు వివరించారు. పారిశుద్ధం సిబ్బంది పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేశారు. బైపాస్ రోడ్డు పక్కనే ఉండడంతో ఎవరంటే వారు చెత్త వదిలేసి వెళుతున్నారని, చెత్తను కుప్పలు కుప్పలుగా వేస్తున్నారని ఇది ఇబ్బందికరంగా ఉందని ఫిర్యాదు చేశారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ కు ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్నారు. చెత్త సమస్యలు త్వరగా పరిష్కరించాలని మరోసారి ఫిర్యాదు రాకుండా చూడాలని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పలు సమస్యలను అక్కడే పరిష్కరించారు. మిగతా వాటిని కూడా పరిశీలిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రతి వార్డు ప్రతి వీధి ప్రతి కుటుంబం సంతోషంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని,ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్,రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంగల్ రాయుడు,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్,మాజీ కౌన్సిలర్లు గుగ్గిళ్ళ చంద్రమోళి,మనుబోలు వెంకటేశ్వర్లు,పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డి నాయుడు,ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మంద శ్రీనివాసులు,ప్రముఖ డాక్టర్ నవీన్ చంద్ర,మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు,పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కె కరీమ్,పీరు సాహెబ్,లస్సీ బాలాజీ,మండెం కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 28న జెడ్పి సర్వసభ్య సమావేశం : కలెక్టర్

**కడప, మార్చి 26 ప్రభాతవార్త :**

ఈ నెల 28న జరిగే జెడ్పి సర్వసభ్య సమావేశానికి.. అన్ని శాఖల జిల్లా అధికారులు.. ప్రగతి నివేధికలతో పాటు అభివృద్ధి ప్రతిపాదనల సమగ్ర సమాచారంతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కడప జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 28 (శనివారం) ఉదయం 9.30 లకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని, జెడ్పి చైర్మన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.కావున జిల్లా పరిషత్ సర్వసభ్య కమిటీ సభ్యులందరూ.. జిల్లాలో అభివృద్ధి ప్రగతి నివేధికలతో పాటు.. అభివృద్ధి చేయాల్సిన అంశాల ప్రతిపాదనలకు సంబంధించి సమగ్ర సమాచారంతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# శ్రీరామ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఒంటిమిట్ట

### దేశంలోనే హనుమంతుడు లేని రామాలయం ఇదే





**రాజంపేట, మార్చి 26 ప్రభాతవార్త**

భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన రామాలయాల్లో ఒకటి ఒంటిమిట్ట ఏకశిలా నగరి కోదండ రామాలయం. చారిత్రక, ఇతిహాసిక, పౌరాణిక చరిత్ర ఈ రామాలయం సొంతం. ఈ ఆలయాన్ని రాజులే కాదు, దొంగలు కూడా కట్టించారు. అంతేకాదు ఆలయం అభివృద్ధి పూర్తి కాకపోవడంతో భద్రాచలం రామాలయంనుఖి రామదాసుఖి ఊరు రా తిరిగి ఎలా నిర్మించారో, ఇక్కడ కూడా ఖివావిలకొలను సుబ్బారావుఖి అనే ఓ మహానుభావుడు నాడు టెంకాయ చిప్ప చేత పట్టి ఊరురా తిరిగి రామాలయం అభివృద్ధి చేశారు. అంతకుముందు ఒంటడు, మిట్టడు అనే గజదొంగలు రాముడు కలలో వచ్చి ఆలయం నిర్మింప చేశారు. అందుకే ఒంటిమిట్ట అని పేరు వచ్చింది. అంతేకాదు ఒకే శిలపై సీతారామలక్ష్మలను ప్రతిష్ట చేయడంతో ఏకశిలా నగరంగా కూడా పేరు ప్రఖ్యాతులు పొందింది. ఒంటిమిట్టలో సీతారామలక్ష్మలను జామవంతుని ప్రతిష్టగా చారిత్రక కథనాలు చెబుతున్నాయి అందుకే తిరుమల తిరుపతి దేవస్థానం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కడప చెన్నై జాతీయ రహదారి లోని ఒంటిమిట్ట చెరువులో 108 అడుగుల జాంబవంతుని విగ్రహాన్ని 20.17 కోట్ల అంచనా వ్యయంతో పెద్ద ఎత్తున నిర్మించనున్నారు.దేశంలోనే హనుమంతుడు లేని రామాలయం ఇదొక్కటే. రామాలయం తూర్పు వైపున తర్వాత కాలంలో సంజీవరాయుడు పేరుతో హనుమంతుడు వెలిశారు. ఒకప్పుడు ఈ ప్రాంతం దండకారణ్యం గా పేరుపొందింది. దండకారణ్యంలో వెళుతున్నప్పుడే సీతమ్మ తల్లికి దప్పిక కావడంతో శ్రీరాముడు రామ బాణాన్ని సంధించి ఇక్కడ రామ తీర్థాన్ని సృష్టించారు. ఈ రామతీర్థం ఎదురుగానే నేడు జాంబవంతుడు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఒంటిమిట్ట కోదండ రామాలయం విలీనం చేసిన తర్వాత వందల కోట్ల రూపాయల అభివృద్ధితో దినదినాభివృద్ధి చెందుతోంది. తెలంగాణలో భద్రాచలం ఎలాగో అంతకంటే ఎక్కువగా ఒంటిమిట్టలో కోదండ రామాలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. భవిష్యత్తులో రామాలయం అభివృద్ధిని న భూతో నా భవిష్యత్ అన్న చందంగా తీర్చిదిద్దేందుకు టీటీడీ ప్రణాళికలు సిద్ధం చేసింది. మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధికి టిటిడి మాస్టర్ ప్లాన్ అమల్లో భాగంగా ఎలాంటి వరాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 1న జరిగే సీతారాముల కళ్యాణం రోజున ప్రకటిస్తారో వేచి చూడాల్సి ఉంది.



దాశరథి ...కరుణాప యోనిధీ

## ఇస్కాన్ ఆధ్వర్యంలో
# శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్ ఊరేగింపు

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 26, ప్రభాతవార్త :**



స్థానిక కొర్రపాడు రోడ్డు లోని రిలయన్స్ మార్ట్ వద్ద వున్న ఇస్కాన్ మందిరం వారి ఆధ్వర్యంలో శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్ వారి మహోత్సవ ఊరేగింపు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భజన, కీర్తనల నడుమ ఆధ్యాత్మిక ఉత్సాహంతో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని"హరే కృష్ణ" మహామంత్రాన్ని జపిస్తూ దివ్యమైన భక్తి వాతావరణాన్ని సృష్టించారు. మహిళలు సంప్రదాయ వేషధారణలో కలశాలు, దీపాలతో ముందుండగా, భక్తులు ఆనందభ రితంగా కీర్తనలు చేశారు. అలంకరించిన దేవాలయ రథంపై శ్రీ సీతారాముల దివ్య దర్శనం అందరినీ ఆకట్టుకుంది. ఈ పవిత్ర సందర్భంలో పాల్గొన్న భక్తులకు మార్గమంతా తీర్థప్రసాదం పంపిణీ చేయబడింది. ఈ మహోత్సవం ద్వారా భక్తులలో భక్తి, ఐక్యత, ఆనందం మరింత పెరిగింది.

# ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించాలి

**పులివెందుల, మార్చి 26, ప్రభాతవార్త :**



పులివెందులతో సహా రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పది ప్రభుత్వ వైద్య కళాశాలలను త్వరలో పూర్తిచేసి ఈ విద్యా సంవత్సరం నుండే ప్రభుత్వ రంగంలో ప్రారంభించాలని, పిపిపి వద్దు ప్రభుత్వ నిర్వహణే ముద్దు అని,పేదలకు ఉచిత వైద్యం దూరం అవుతోందని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీ గురువారంన గుంటూరు పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, కాంగ్రెస్ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే. ప్రభాకర్ రెడ్డి,సామాజిక ఉద్యమ నేత ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య,వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు కే. నారాయణ,బిసి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బీసీ రమణ వివిధ విద్యార్థి యువజన, పౌరసంస్థల నేతలు,ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ అలా వెంకటేశ్వర్లు,జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి,సామాజికవేత్త డాక్టర్ వసుంధర కుర్ర నేతృత్వంలో వందలాదిమంది పులివెందుల మెడికల్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రసంగిస్తూ పీపీపీ విధానంలో వైద్య కళాశాలను నిర్మిస్తే రిజర్వేషన్లు అమలు కావని,పేద విద్యార్థులు, ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోతారని,పేద రోగులకు వైద్యం ఉచితంగా లభించదని వివరిస్తూ ప్రభుత్వం వైద్య రంగంలో పిపిపి విధానానికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రైవేటుపరం చేసేటట్లు ఉందని ఈశ్వరయ్య ఎద్దావ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి మాట్లాడుతూ పులివెందల మీద, కడప జిల్లా మీద చంద్రబాబు కక్ష కట్టడం శోచనీయమని ఆవేదన వెల్లబుచ్చారు.దాదాపు 150 కోట్ల రూపాయల విలువచేసే 50 ఎకరాల భూమిని, 412 కోట్ల రూపాయలతో నిర్మించిన భవనాలను ప్రైవేటు వాళ్లకు అప్పజెప్పాలనే ధోరణిని విడనాడాలని కోరారు.2024 25 సంవత్సరంలోనే నేషనల్ మెడికల్ కమిషన్ కేటాయించిన 50 ఎంబిబిఎస్ సీట్లను చంద్రబాబు ప్రభుత్వం వద్దనటం సహేతుకం కాదన్నారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి ప్రసంగిస్తూ వైకాపా ప్రభుత్వం ఒకేసారి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులు తెచ్చి అందులో ఏడు కళాశాలను ప్రారంభించారని, మిగిలిన 10 నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం గత 21 నెలలుగా ఏమాత్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరం అన్నారు. రాష్ట్రంలో వివిధ పార్టీలు ప్రజాసంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు పౌర సంస్థలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ అలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ ప్రైవేటు వైద్య కళాశాలలో అధిక ఫీజులు కట్టలేక వందలాది సీట్లు ఖాళీగా ఉన్నాయని కనుకనే టెండర్లలో ఎవరు పాల్గొనటం లేదనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గ్రహించాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ నేటి ముఖ్యమంత్రి వివిధ ఈవెంట్ల పేర్లతో వేలాది కోట్ల రూపాయలను మంచినీళ్ల ప్రాయంగా దుబార చేస్తున్నారని అందులో ఏ కొంచెం ఖర్చుపెట్టినా నిర్మాణంలో ఉన్న పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పూర్తి అవుతాయని లక్షలాది మంది పేద రోగులకు ఉచిత వైద్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

# ప్రొద్దుటూరులో కలకలం..

- ముగ్గురు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య యత్నం
- నలుగురి పరిస్థితి విషమం

**ప్రొద్దుటూరు క్రైం, మార్చి 26, ప్రభాతవార్త:**



పెద్ద కుమార్తె సుష్మ.
చిన్న కుమారుడు ఘన



విష ద్రావణం సేవించిన భువనేశ్వరి

ప్రొద్దుటూరు పట్టణంలోని ఈశ్వర్‌నగర్‌లో గురువారం ముగ్గురు పిల్లలకు విషమిచ్చి అనంతరం తల్లి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. ఈశ్వర్‌రెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న భువనేశ్వరి తన ముగ్గురు పిల్లలు అయిన సుష్మ(13), నికిత(11), గణ (9)లతో పాటు తన అత్త అయిన తిరుపతమ్మతో కలిసి జీవిస్తున్నారు. ఏడాది కిందట తన భర్త అయిన వెంకట కృష్ణ పిల్లలను, భార్యను వదిలి వెళ్లిపోవడం జరిగింది. అయితే అత్త అయిన తిరుపతమ్మ తన కోడలు భువనేశ్వరిపై అనుమానంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చేవని ఈ నేపథ్యంలో భువనేశ్వరి మనస్తాపం చెంది స్కూలు నుంచి వచ్చిన ముగ్గురు పిల్లలకు కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలిపి ఇచ్చి అనంతరం ఆమె సేవించడం జరిగింది. మధ్యాహ్నం పూలు విక్రయించుకొని వచ్చిన తన అత్త తిరుపతమ్మ అపస్మార స్థితిలో ఉన్న ముగ్గురిని స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలించారు. పరిస్థిత విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### రజత కాంతులతో దగదగ
# మెరిసిపోతున్న జగదభి రామయ్య కోవెల



**ఒంటిమిట్ట మార్చి.26. ప్రభాతవార్త**

రెండవ అయోధ్య ఆంధ్ర భద్రాచలంగా కీర్తి ప్రతిష్టలు గడించిన ఏకశిలానగర ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో ఉత్సవాల రజత కాంతుల శోభ ప్రారంభమైందని చెప్పాలి. ఈ సందర్భంగా టీటీడీ సిబ్బంది రామాలయాన్ని పరిసరాలను ప్రత్యేక కాంతులతో విద్యుత్ దీపాలతో, రంగవల్లికలతో, లేత పచ్చుటి మామిడి తోరణాలతో అరటి పిలకలతో వివిధ రకాల పుష్పాలతో అత్యద్భుతంగా తీర్చిదిద్దడం జరిగింది. రామాలయం నుంచి కళ్యాణ వేదిక వరకు క్యూలైన్లు, దశావతారాల విద్యుత్ దీపాల ఫ్లెక్సీలు, రామనామ స్మరణ మైకు సెట్లు, చలువ పందిళ్లు సిద్ధం చేయడం జరిగింది. ఉత్సవాలకు వస్తున్న భక్తులకు అన్ని మౌలిక సౌకర్యాలు సిద్ధం చేశారు. మాడు వీధులను, ఆలయ పరిసరాలను, జర్మనీ షెడ్లను నిత్యము అన్నదాన కేంద్రాలను సుందరంగా సిద్ధం చేయడం జరిగింది. గుత్తేదారులు చేయు పనులన్నీ టీటీడీ అధికారులు దగ్గరుండి పరిశీలిస్తూ సిద్ధం చేశారు. ఆలయానికి వస్తున్న భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి వెళ్లేందుకు సిద్ధం చేయడం జరిగింది.

2వ పేజీలో

## క్యాన్సర్ నివారణ టీకాపై అవగాహన



సుండుపల్లె, మార్చి 26, ప్రభాతవార్త :
మండలంలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మడితాడు జిల్లా పరిషద్ ఉర్దూ పాఠశాల నందు డాక్టర్ శేఖర్ రెడ్డి పాఠశాలకు వెళ్లి క్యాన్సర్ నివారణ టీకాపై విద్యార్థులకు అవగహనా కల్పిస్తూ ఈ టీకా వేసుకోవడం వలన గర్భశాయ ముఖ ద్వారా క్యాన్సర్ నివారించవచ్చని ఈ టీకా 14 సంవత్సరాల పిల్లలకు మాత్రమే వేయబడుననియు,కావున ఈ అవకాశం వినయోగించుకోవాలనియు, ఈ టీకా వలన ఎలాంటి సమస్యలు రావనియు ఈ పుకార్లను నమ్మవద్దని కావున పిల్లలు వచ్చి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో టీకాలు వేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో ఏం పి హెచ్ ఇ ఒ వీర నారాయణ, ప్రధానోపాధ్యాయుడు మరియు సిబ్బంది పాల్గొన్నారు. సి హెచ్ ఒ లక్ష్మి ప్రసన్న, ఎ ఎన్ ఏం శశికళ, ఆశ పద్మజ సుగుణ లింక్ వర్కర్ నాగార్జున పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభించాలి

ఎడ్యుకేషన్ ఫిబ్రవరి 26 ప్రభాతవార్త :



రాష్ట్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణమే పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి ,యువజన సంఘం (పిఆర్ఎస్ వైఎఫ్) రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను 2026, 27 విద్యా సంవత్సరం తరగతులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని, తరగతులు ప్రారంభానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఇప్పటి వరకు రాష్ట్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని వారు అన్నారు. ఈ కళాశాలలో 150 ఎంబిబిఎస్ సీట్లు 24 పీజీ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు, ఈ సీట్ల భర్తీ కోసం కానీ, తరగతుల ప్రారంభానికి కానీ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయకుండా, కరువుకు నిలయమైన కడప జిల్లాలోని పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడం దుర్మార్గమని, ఇప్పటికైనా రాష్ట్ర కూటమి ప్రభుత్వం స్పందించి 2026, 27 విద్యా సంవత్సరంలోనే పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, రాష్ట్ర నాయకులు హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి

ముద్దనూరు, మార్చి 26, ప్రభాతవార్త:



మండలంలో ఉన్న ఆయా బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లను గురువారం కలసి కౌలు రైతుల జాబితాను అందించి అటువంటి రైతులకు కౌలు రుణాలు మంజూరు చేయాలి అని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మండలంలో ఆయా కౌలు రైతుల జాబితాను సంబంధించిన బ్యాంకు బ్రాంచ్ లకు అందించినట్లు తెలిపారు.ఆయా బ్యాంకు ల పరిధిలో ఉన్న కౌలు రైతులకు పంట సాగులో ఇబ్బందులు కలగకుండా కౌలు రుణాలు మంజూరు చేయించి పంట సాగును సులభతరం చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్న రైతులు ఆయా బ్యాంకు ల దగ్గరికి వెళ్లి సంబంధించిన ఫీల్డ్ ఆఫీసర్స్ ను కలవాలి అని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత బ్యాంకు మేనేజర్లు సుదర్శన్, నరసింహులు, రవీంద్ర బాబు,వీర పాల్గొన్నారు.

## వ్యవసాయానికి ఊతమిచ్చేలా బాబు పాలన

కడప కార్పొరేషన్ మార్చి 26 ప్రభాతవార్త:



ఐటీ, క్వాంటం, ఏఐ వంటి రంగాల్లో కొత్త టెక్నాలజీలు, ల్యాబులు ఏర్పాటు చేస్తున్న తరహాలోనే.. వ్యవసాయానికి మరింత ఊతమిచ్చేలా అలాంటి వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేస్తున్నారని టిడిపి సీనియర్ నాయకులు అలంఖాన్ పల్లి లక్కిరెడ్డి కొనియాడారు. గురువారం కడపలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బాబు ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. లబ్ధిదారులకు మేలు జరుగుతుందని తెలిపారు. ప్రతీ మూడు నెలలకూ పాలనా అంశాలపై సమీక్ష చేసుకుని, ఉన్న పరిమిత వనరులతోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్సు చేస్తున్నారని కీర్తించారు. గడచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులను తీసుకొచ్చారని చెప్పారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా తెచ్చిన 10 సూత్రాలు అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు.

## 28న సామాజిక తనిఖీపై బహిరంగ సభ

పెద్దమండెం మార్చి 26 ప్రభాతవార్త
మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు 28 . 12.25 నుండి, 23.03.26 వరకు చేపట్టిన పనులపై ఈనెల 28న ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజా వేదిక బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందని ఏపీవో సురేంద్ర నాథ్ రెడ్డి అన్నారు గ్రామీణ నీటి సరఫరా అటవీ శాఖ గృహ నిర్మాణం పశుసంవర్ధక శాఖ పశుగ్రాసం పెంపకం గోకుల షెడ నిర్మాణం తదితర వాటిపై చేపట్టిన పనులపై ప్రజావేదిక బహిరంగ సభకు మండల అధికారులు ప్రజాప్రతినిధులు రైతులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## పెరటి కోళ్ల పంపిణీ



వీరపునాయునిపల్లి మార్చి26, ప్రభాతవార్త :
మండల సమైక్య కార్యాలయం నందు బుధవారం ఏటీఎం భాగ్యమ్మ డ్వాక్రా సంఘ సభ్యులకు ముప్పై (30)యూనిట్ల పెరటి కోళ్లను పంపిణీ చేసింది ఒక యూనిట్ ధర 3700 రూపాయలు, వీడినే సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు పెరటి కోళ్ల పెంపకం ద్వారా కుటుంబ ఆదాయం పెంచుకోవచ్చునని ఆయన తెలిపారు ఈ కోళ్ల పెంపకం మంచి జీవనో ఉపాధి అని ఆమె తెలిపారు కోళ్లతోపాటు వాటికి సంబంధించిన మెడిసిన్ కిట్టును కూడా అందజేశారు ఈ కార్యక్రమంలో సీసీలు డ్వాక్రా సంఘ సభ్యులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు శ్రీరామనవమి వేడుకలు

దువ్వూరు, మార్చి 26, ప్రభాతవార్త:
మండల పరిధిలోని వివిధ రామాలయాల్లో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి దేవాలయంలోనూ శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రామాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దువ్వూరుకు సమీపంలోని పాత దువ్వూరులో వెలసి ఉన్న కోదండ రామస్వామి దేవాలయం నందు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు తెలిపారు. అలాగే గొల్లపల్లె, గుడిపాడు తదితర గ్రామాల్లో కూడా సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు.

# నూతన మోటార్ ప్రారంభం



బ్రహ్మంగారిమఠం మార్చి 26 ప్రభాతవార్త :
మండలంలోని రేకలకుంట పంచాయతీ వాంపల్లెచెరువు గ్రామంలో గతంలో ఉన్న పాతమోటార్ అనేక మరమ్మత్తులకు గురవుతున్న కారణంగా గ్రామస్తులు నీటి ఎద్దడికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమస్యను కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా, ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. వేసవిని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గం లోని ప్రజలు నీటికోసం ఇబ్బంది పడకూడదనే దేశంతో వెంటనే నూతన మోటార్ అమర్చాలని సంభందిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించడం జరిగింది.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి,ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, నరసయ్య, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులరెడ్డి,అసిస్టెంట్ ఏఈ నాగార్జునలు కలిసి ఈరోజు నూతన మోటార్ ను ప్రారంభించి గ్రామస్థులకు నీటి కొరత లేకుండా సమస్యను పరిష్కరించడం జరిగింది.తమ గ్రామానికి నీటికొరత లేకుండా చేసిన ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్‌కి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు,చెన్నారెడ్డి,రామచంద్ర, శివాయాదవ్ తధితరులు పాల్గొనడం జరిగింది.

## విద్యార్థుల నుంచి క్రమశిక్షణ

# పట్టుదల ఉత్సాహం ప్రధానం..

సుండుపల్లె, మార్చి 26,ప్రభాతవార్త :



విద్యార్థుల నుంచి ఉన్నత స్థాయి వారి వరకు ఎవరికైనా క్రమశిక్షణ పట్టుదల ఉత్సాహం ప్రధానమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తి మెడమల్లి బాలాజి తెలిపారు. గురువారం సాయంత్రం మండలపరిధిలోని తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బాలాజి పాఠశాలలో మండల స్థాయి నుంచి రాష్ట్ర, దక్షిణ భారత దేశ స్థాయిలో ఆపాఠశాల విద్యార్థులు చేసిన ప్రదర్శనను తిలకించారు.అభినందన సభలో మాట్లాడుతూ ప్రాంతమేదైనా ప్రతి ఒక్కరికి క్రమశిక్షణతో కూడిన పట్టుదల అవసరమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

## కూల్ డ్రింక్స్ వద్దు సహజపానీయాలే ముద్దు



సిద్ధవటం మార్చి 26,ప్రభాతవార్త
విద్యార్థులు సహజ పానీయాలు తీసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఏఎంసి డైరెక్టర్ కృష్ణ యాదవ్ తెలిపారు. మండలంలోని భాకరాపేట సమీపాన 11వ పోలీస్ పటాలయంలో జ్ఞాన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కూల్ డ్రింక్ తీసుకోవడం మానేయాలని సహజ పానీయాలు తీసుకోవడం వల్ల ఆరోగ్య వంతులుగా ఉంటారని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రైవేట్ స్కూల్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్ది, మౌలిక వసతులు సమకూర్చి ప్రతి విద్యార్థి కడుపునిండా భోజనం తినేందుకు సన్న బియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని శ్రీరాముని పండుగ సందర్భంగా ముందస్తుగా వడపప్పు, పానకం ప్రతి విద్యార్థికి అందించామని తెలిపారు జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు షమీర్ భాష మాట్లాడుతూ సహజ పానీయాల్లో శక్తి ఉంటుందని కూల్ డ్రింక్ తీసుకోవడం విద్యార్థులు మానుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్, పోతులూరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉచిత పశు వైద్య శిబిరం.

మైదుకూరు, మార్చి 26, ప్రభాతవార్త:
మండలంలోని ఉత్సలవరం గ్రామం నందు వ్యవసాయ మార్కెట్ కమిటీ సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది.ఈ శిబిరాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ ప్రారంభించారు. ఈ శిబిరం నందు 22 చూడి పరీక్షలు,15 గర్భ సంబంధిత చికిత్స లు ,46 దూడలకు నట్టాల నివారణ, 1600 గొర్రెలకు నట్టల నివారణ 28 సాధారణ చికిత్సలు చేసి క్యాల్షియం టానిక్లు,లివర్ టానిక్లు, ఎముకల పొడి రైతులకు అందించారు ఈ కార్యక్రమం ఉద్దేశించి గంజికుంట సర్పంచ్ లెక్కల జయభారత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే మినీ గోకులం గడ్డి పెంపకం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ మరియు సెక్రటరీ వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.డాక్టర్ గురివిరెడ్డి,వనిపెంట పశువైద్యాధికారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యం ద్వారా పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యశోద, మీరావల్లి, మీరా కుమారి, వనిపెంట అటెండర్ చిన్న సుబ్బారాయుడు, గోపాలమిత్ర నరసింహులు మరియు రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## చలివేంద్రం ఏర్పాటు

సుండుపల్లి, మార్చి 26,ప్రభాతవార్త :
మండల కేంద్రంలో బస్సు షెల్టర్ ఎదురుగా ఏబీవీపీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఈ చలివేంద్రాన్ని తెదేపా మండల అధ్యక్షులు కుడి రమేష్ నాయుడు ఎస్ఐ ఎస్ఎంకె హుస్సేన్ లు అతిధులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులకు, మండల ప్రజలకు ఎండాకాలంలో దాహం తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఏబీవీపీ విద్యార్థి సంఘ మండల కమిటీ సభ్యులకి అభినందనలు తెలిపారు. ఇలాంటి సమాజసేవ కార్యక్రమం చేయడం హర్షదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, మహేష్ వర్మ, ఎయిర్టెల్ మధు, వాస్తవ్, మురారి, అశోక్, సాయి,విజయ్,యశ్వంత్, వెంకటేష్, కలాం, లతేష్ పాల్గొన్నారు.




## బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నందలూరు, మార్చి 26 ప్రభాతవార్త :



నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా షేక్ మహమ్మద్ అలీ, ప్రధాన కార్యదర్శిగా నాయనపల్లి అనుదీప్ జయసింహ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగినది. ట్రెజరర్‌గా మాడపురి నళిని, జాయింట్ సెక్రటరీగా తెట్టునూరు మొహమ్మద్, స్పోర్ట్స్ సెక్రటరీగా ముంగి నాగ విజయ సింహ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను ఈనెల 31వ తేదీన ఏకగ్రీవంగా ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ఈనెల 20 నుండి 23 వ తేదీ వరకు నామినేషన్లు, 24వ తేదీన స్క్రూటింగ్, 25న విత్డ్రాయిల్స్, 26న ఫైనల్ లిస్టు, 31వ తేదీన ఎన్నికలు, ఫలితాలు నిర్వహించాల్సిందిగా నోటిఫికేషన్ విడుదల కాగా ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎంపిక జరిగింది. ఈ ఎన్నికలకు అధికారులుగా హస్తవరం ఆనందకుమార్, గొబ్బిళ్ళ సుబ్బరామయ్య వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు నరసింహులు అభినందనలు తెలిపారు.

## ఎద్దుల సుబ్బరాయుడుతో చమర్తి భేటీ



నందలూరు, మార్చి 26 ప్రభాతవార్త:
తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సమర్థి జగన్మోహన్ రాజు గురువారం మాజీ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడుతో భేటీ అయ్యారు. రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎద్దుల విజయసాగర్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో పలు రాజకీయ అంశాలపై చర్చించారు. మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. అనంతరం చమర్తిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, టిడిపి నాయకులు మోడపోతుల రాము, జయచంద్రారెడ్డి, శివ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## కోరం లేక వాయిదా వేసిన సమావేశం



సిద్ధవటం మార్చి 26 ప్రభాతవార్త
సిద్ధవటం మండలం మాధవరం1 గ్రామ,వార్డు మెంబర్ల సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడింది మండలంలోని మాధవరం, 1 గ్రామం సచివాలయంలో గురువారం సర్పంచ్ జానకి రామయ్య అధ్యక్షతన గ్రామ అభివృద్ధి కొరకు వార్డు మెంబర్ల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పంచాయతీ సెక్రెటరీ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ మాధవరం1 గ్రామంలో గ్రామ అభివృద్ధి కొరకై సాధారణ సమావేశం ఏర్పాటు చేశామని 14 మంది గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు ఉండగా7 వ వార్డు మెంబర్ నాగలక్ష్మి ఒక్కరు మాత్రమే హాజరయ్యారని కోరం లేక సాధారణ సమావేశం వాయిదా వేసామని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జానకి రామయ్య,ఎంపీటీసీలు శివయ్య, లక్ష్మిరెడ్డి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వైసిపి రైతు విభాగం నేత ఎం.మస్తాన్ రెడ్డి

వేంపల్లె:మార్చి 26 ప్రభాతవార్త



అరటి రైతులను ప్రభుత్వం రూ.50 వేల చొప్పున ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని వైఎంఆర్సీపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. మస్తాన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతనెల ఫిబ్రవరి నెలలో అరటి టన్ను రూ. 25 వేలు పలికిందని, మార్చి మొదటి వారంలో రూ. 53 వేలకు పడిపోవడం శోచనీయమన్నారు. దీంతో అరటి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. అలాగే పిసిసి చీఫ్ షర్మిలారెడ్డి ప్రభుత్వాన్ని నిలదీయాల్సింది పోనిచ్చి మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై నిందలు వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అరటి రైతుల పరిస్థితిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇన్పుట్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## చట్టాన్ని అందరూ గౌరవించాలి

రాజుపాళెం, మార్చి 26, ప్రభాతవార్త:
మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో గురువారం ఫ్యాక్షన్ జోన్ సిఐ గోవిందరెడ్డి ప్రజలతో సమావేశం నిర్వహించి చట్టము, పోలీసు వ్యవస్థ ప్రజల సామాజిక బాధ్యతల గురించి వివరించారు. చట్టాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలని చట్టానికి లోబడి మనుగడ సాగించాలని అప్పుడే ప్రజలు సామరస్యంగా ప్రశాంతంగా జీవించుటకు సాధ్యమవుతుంది అన్నారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదని, భేదాభిప్రాయాలు, సమస్యలతో గొడవలకు తావివ్వకుండా ఎటువంటి సమస్యలు ఉన్న పోలీసుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎన్నికలు, రాజకీయాలు ప్రజాస్వామ్య బద్ధంగా జరుపుకోవాలని తెలిపారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారి ఉన్నత చదువుల కొరకు పాటుపడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం పోలీసులు పాల్గొన్నారు.



## దువ్వూరులో సీసీ రోడ్డు పనులు



దువ్వూరు, మార్చి 26, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన దువ్వూరులో 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు పంచాయతీ రాజ్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. దువ్వూరులోని అశోక్ నగర్ వీధిలో వర్షాలు వస్తే నీరంతా నిలబడి ప్రజలు, వాహనాదారులు వెళ్లేందుకు ఇబ్బంది పడేవారు. నీరు నిలబడకుండా ఉండేందుకు గాను ఉపాధి హామీ పథకం ద్వారా ఈ రోడ్డుకు 10 లక్షల రూపాయలు కేటాయించారు. ఈ పనులను గురువారం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, పాపినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్ళిన వ్యక్తి నీటిలో మునిగి మృతి

గోపవరం, మార్చి 25, ప్రభాతవార్త



గోపవరము మండలము పెద్ద గోపవరం ఎస్సీ కాలనీ కి చెందిన కత్తి మల్లేష్. (38 ) ఈతకు వెళ్లి మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు గురువారం మద్యాహ్నము తన సమీప బంధువు చిన్నఖర్మ కు వెళ్లి అక్కడ నుండి తన గ్రామస్తులు, బంధువులతో కలిసి పెద్దగోపవరము గ్రామమునకు వచ్చి చెరువు కట్ట ప్రక్కన ఉన్న బావి వద్దకు స్నానము చేయుటకు వెళ్లి ఆ బావిలోకి దిగి ఈదులాడుతూ ఒక్కసారిగా నీటిలో మునిగి పోయినట్టు బంధువులు తెలిపారు. అక్కడ ఉన్నవారు అతనికోసం బావిలోపల గాలించగా వారికి కనిపించక పోవడముతో అగ్నిమాపక శాఖ వారికి తెలుపగా, అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని వారి వద్ద ఉన్న పరికరముల సహాయముతో అతనిని బావి నీటిలో అడుగునుండి బయటకు వెలికితీసి వారి బంధువులకు అప్పగించగా. అతని బంధువులు తనని బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లి చూపించగా అప్పటికే అతను మృతి చెందినాడని డ్యూటీ డాక్టర్ ధ్రువీకరించినారని. ఆ విషయము పై మృతుని భార్య రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## యశోదకు అరుదైన గ్లోబల్ గౌరవం..

కడప కార్పొరేషన్ మార్చి 26 ప్రభాతవార్త:



వైద్యరంగంలో అరుదైన మైలురాయిని అధిగమించి, అంతర్జాతీయ ఎల్సో (ఈఎల్ఎస్ఓ) సంస్థ నుండి అత్యున్నత ప్లాటినం అవార్డు యశోద హాస్పిటల్ కు దక్కడం గొప్ప విషయమని డాక్టర్ సిద్ధార్థ తెలిపారు. ఈసీఎంఓ సెంటర్‌గా దేశంలోని రికార్డు సృష్టించిందన్నారు. గురువారం కడప హరిప్రియ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరులతో డాక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ప్రాణరక్షణ చికిత్సలు, అధునాతన ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్‌లు దేశవిదేశాల నుండి రోగులను వేగంగా తరలించే ఎయిర్ అంబులెన్స్ సేవలను అనుసంధానించడంలో యశోద హాస్పిటల్ అగ్రగామిగా నిలిచిందనీ చెప్పారు. అత్యంత క్లిష్టమైన గుండె, ఊపిరితిత్తుల వైఫల్యంతో బాధపడే రోగులకు వి.ఎ, వివి, ఈసీఎంఓ, ఈసీపీఆర్ వంటి అత్యాధునిక చికిత్సల ద్వారా పునర్జన్మ ప్రసాదిస్తూ, అంతర్జాతీయ సంస్థల సరసన నిలిచిందన్నారు. అత్యాధునిక ఐసీయూ కేర్, రోబోటిక్ టెక్నాలజీ నిపుణులైన మల్టీడిసిప్లినరీ వైద్య బృందం కలయికతో ప్రాణాంతక స్థితిలో ఉన్న రోగులకు నిరంతరాయంగా 247 అంతర్జాతీయ క్లినికల్ ఎక్సలెన్స్‌ను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

## నేటి నుండి మక్కేషా వలి ఉరుసు ఉత్సవాలు



దువ్వూరు, మార్చి 26, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన దువ్వూరుకు సమీపంలో పాత దువ్వూరులో వెలసి ఉన్న శ్రీ హజరత్ సయ్యద్ మక్కేషా వలి ఖాదరి ఉర్సు ఉత్సవాలు శుక్రవారం నుండి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం గంధం, శనివారం ఉరుసు కార్యక్రమాలు ఉంటాయన్నారు. దువ్వూరు మండలంలో పరమాత్మ స్వరూపుడిగా పేరొంది పాత దువ్వూరు నుండి వెలసిన శ్రీ మహనీయుల కృపవలన చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు దీర్ఘకాలిక, మానసిక రోగ బాధల నుండి విముక్తి కలుగుతారన్నారు. దీంతో ప్రతి ఏడాది ఈ ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు మేళ తాళాలు, ఫకీర్ల మేళాలతో పూల చాందిని, గంధం బయలుదేరుతుంది అన్నారు. అలాగే శనివారం ఉరుసు ఉత్సవాలు ఉంటాయని ఈ సందర్భంగా గొప్ప ఖవాలి కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఉరుసు ఉత్సవాలకు వచ్చే వారికి అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## రైతుల విజ్ఞాన యాత్ర

కడప మార్చి 26 ప్రభాతవార్త:
జిల్లా వనరుల కేంద్రం కడప వారు కృషోన్నతి యోజనఆత్మ సౌజన్యంతో తిరుపతి లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వ్యవసాయ పరిశోధన స్థానం పెరుమాళ్ళ పల్లెకి రైతుల సందర్శనార్థం మరియు విజ్ఞాన సముపార్జన నిమిత్తం ,రైతుల యొక్క వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు సందర్శించడం అయినది. జిల్లా వనరుల కేంద్రం నుండి వ్యవసాయ అధికారులు కే. సుచిత్ర మరియు పి.పద్మజ వారి ఆధ్వర్యంలో జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు యం నాగరాజ పర్యవేక్షణలో ఈ విజ్ఞాన యాత్ర చేపట్టడం జరిగింది. ఉదయం 8 గంటలకు జిల్లా వ్యవసాయ అధికారి యం.సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఆత్మ పథక సంచాలకులు విజయలక్ష్మి లు పచ్చజెండా ఊపి యాత్రను ప్రారంభించారు.

# శ్రీ రాముని జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం..

వేంపల్లె మార్చి 26 ప్రభాతవార్త
శ్రీ రాముని జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వేంపల్లి నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టె నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పాత గండి రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల మరియు నారాయణ జూనియర్ కళాశాలలో ముందస్తు శ్రీ రామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించినట్లు కొట్టె నారాయణ రెడ్డి తెలిపారు. పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణాన్ని తలపించేలా పూలతో, తోరణాలతో, రంగురంగుల అలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు.ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు, శబరి, సుగ్రీవుడు వంటి పౌరాణిక పాత్రల వేషధారణలతో ఆకట్టుకుని, తమ ప్రతిభను ప్రదర్శించారు. పిల్లలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా "రామాయణం"లోని కీలక ఘట్టాలను చిన్నారులు అద్భుతంగా ప్రదర్శన చేశారు. విద్యార్థులలో పోటీ భావనను పెంపొందించేందుకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కొట్టె నారాయణ రెడ్డి మాట్లాడుతూ శ్రీ రామ నవమి పండుగ యొక్క ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరించారు. శ్రీరాముడు సత్యనిష్ఠ, ధర్మపరుడు, కర్తవ్యబద్ధుడు అని, ఆయన జీవితం మనిషి ఎలా ఉండాలో చూపించే మార్గదర్శకమని తెలిపారు. కుటుంబ విలువలు, గురు గౌరవం, తల్లిదండ్రుల పట్ల గౌరవం వంటి గుణాలను విద్యార్థులు తమ జీవితంలో అలవరుచుకోవాలని సూచించారు. అలాగే పండుగలు కేవలం ఆనందానికి మాత్రమే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసే సందర్భాలని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ నాయకుల పథకాలను ప్రజలకు అందేలా చూడాలి



**పీలేరు మార్చి 25 ప్రభాతవార్త:**
పీలేరు నియోజకవర్గం లోని వాల్మీకిపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నందు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ రాజమండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దళితుడిని ఇంటిలోనికి రానివ్వకుండా దళితుడిని నీచమైన పదాలతో దూషించారు.దీన్ని మేము ఎస్సి కార్యవర్గ సభ్యులుగా తీవ్రంగా ఖండిస్తున్నాము. అలాగే పేద విద్యార్థు లు తింటున్న మధ్యాహ్నం భోజనం పై గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరంగా ఉన్నాయి పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతుంటే గరికపాటికి కడుపు మండి పేద విద్యార్థులను కించపరిచి మాట్లాడడం అతనికి తగదని తీవ్రంగా హెచ్చరిస్తున్నాము గరికపాటి నరసింహారావు వెంటనే పేద విద్యార్థులకు విద్యార్థి తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము నీవు చేస్తున్న వ్యక్తి ప్రవచనాలతో కానుకలు డబ్బులు సంపాదించుకుంటూ నీవు మాత్రం ఖరీదైన హిందూ ఆరగించవచ్చు కానీ పేద విద్యార్థులకు ఒక్కపూట భోజనం పెట్టి వారికి బట్టలు పుస్తకములు గవర్నమెంట్ ఇస్తుంటే దాన్ని కూడా గరికపాటి హేళనగా మాట్లాడడం తగదని తెలియజేస్తున్నాము రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి దళితులపైన దళిత మహిళల పైన అత్యాచారాలు దౌర్జన్యాలో తప్ప అభివృద్ధి జరగలేదని మేము తెలియజేస్తున్నాము గరికపాటి పైన ఆదిరెడ్డి అప్పారావు పైన కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్సి కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు ఇచ్చిన హామీలు మర్చిపోయి మీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను దోపిడీలను మానభంగాలను సమర్ధించుకుంటున్నారే తప్ప రాష్ట్రంలో అభివృద్ధి కనపడలేదని తెలియజేస్తున్నాము ఇకనైనా చంద్రబాబు నాయుడు పాలన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు లబ్ధి చేకూర్చేలా పథకాలు అందించేలా చూడాలని డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ సభ్యులు వి హరి చిన్న ఎల్లప్ప అంజన్నప్ప సదాశివం రవికుమార్ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున సుధాకర వెంకటస్వామి శ్యాముల్ నియోజకవర్గ అధ్యక్షులు రాజన్నఎస్సీ మండల అధ్యక్షులు రామానుజులు రఘు సుందరయ్య విజయ్ వెంకటరమణ పాల్గొన్నారు.

## ఏఐటియుసి 18 వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



**లక్కిరెడ్డిపల్లి మార్చి 25 ప్రభాతవార్త**
లక్కిరెడ్డిపల్లి ఏఐటియుసి రాష్ట్ర 18వ మహాసభలను విజయవంతం చేయాలని బుధవారం స్థానిక సచివాలయం సమీపంలో ఏఐటియుసి అన్నమయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వర్రీ సురేష్ కుమార్, సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, కరపత్రాలు విడుదల చేశారు అనంతరం మాట్లాడుతూ ఏప్రిల్ 26 నుండి 29 వరకు తిరుపతిలో జరగనున్న ఏఐటియుసి 18వ రాష్ట్ర మహాసభలకు కార్మికుల, కర్షకుల హక్కులు, సంక్షేమం, ప్రస్తుత కార్మిక సమస్యలు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం వంటి ముఖ్య అంశాలపై చర్చించేందుకు కీలక వేదికగా నిలుస్తాయని తెలిపారు దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడం, కార్మికుల ఐక్యతను మరింత బలోపేతం చేయడం, శ్రమ చట్టాల పరిరక్షణ కోసం పోరాటాలకు దిశానిర్దేశం చేయడం ఈ మహాసభల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నేలపాటి శ్రీనివాసులు, ఏఐటీయూసీ మండల నాయకులు శేఖర్, రాజు, రెడ్డి బాబు, తదితరులు పాల్గొన్నారు

## జీవన్ దాతృత్వం గ్రామంలో పారిశుద్ధ్యం



ఆర్టీసీ బస్టాండులో పారిశుద్ధ్యం చర్యల్లో జీవన్ ప్రకాష్

**చౌడేపల్లి, మార్చి 25 ప్రభాతవార్త**
సమాజ సేవకు నేను సైతం అన్నట్లుగా పిల్లారీ ఏజెన్సీస్ అధినేత పిల్లారి జీవన్ ప్రకాష్ ముందుకొచ్చాడు. పట్టణంలోని ముఖ్యమైన ప్రదేశాలు, స్మశాన వాటికలో నెలకొని వున్న పారిశుద్ధ్య లోపాన్ని గుర్తించాడు. ఎన్ని రోజులైనా ఎవరూ ముందుకు రాకపోవడంతో తన సొంత ఖర్చుతో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాడు. స్థానిక ఆర్టీసీ బస్టాండు, అంగన్‌వాడీ కేంద్రం ముందు, నేతాజీనగర్‌లోని పరిసర ప్రాంతాలతోపాటు గ్రామానికి సమీపంలోని హరిశ్చంద్ర ఘాట్(స్మశానవాటిక)వద్దగల చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, అపరిశుభ్ర ప్రదేశాలలో జెసిబి సాయంతో తీయించాడు. ఎన్నో రోజులుగా పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని దగ్గరుండి తీసి వేయించడంతో స్థానికులు, ప్రయాణీకులు పిల్లారి జీవన్ ప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# దళితులను అవమానిస్తే సహించం



**పీలేరు మార్చి 25 ప్రభాతవార్త:**
పీలేరు నియోజకవర్గం లోని వాల్మీకిపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నందు విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ రాజమండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దళితుడిని ఇంటిలోనికి రానివ్వకుండా దళితుడిని నీచమైన పదాలతో దూషించారని దీన్ని మేము ఎస్సి కార్యవర్గ సభ్యులుగా తీవ్రంగా ఖండిస్తున్నాము. అలాగే పేద విద్యార్థు లు తింటున్న మధ్యాహ్నం భోజనం పై గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరంగా ఉన్నాయి పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతుంటే గరికపాటికి కడుపు మండి పేద విద్యార్థులను కించపరిచి మాట్లాడడం అతనికి తగదని తీవ్రంగా హెచ్చరిస్తున్నాము. గరికపాటి నరసింహారావు వెంటనే పేద విద్యార్థులకు విద్యార్థి తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము. నీవు చేస్తున్న వ్యక్తి ప్రవచనాలతో కానుకలు డబ్బులు సంపాదించుకుంటూ నీవు మాత్రం ఖరీదైన ఆహారం తింటున్నారు. కానీ పేద విద్యార్థులకు ఒక్కపూట భోజనం పెట్టి వారికి బట్టలు పుస్తకములు గవర్నమెంట్ ఇస్తుంటే దాన్ని కూడా గరికపాటి హేళనగా మాట్లాడడం తగదని తెలియజేస్తున్నాము. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి దళితులపైన దళిత మహిళల పైన అత్యాచారాలు దౌర్జన్యాలో తప్ప అభివృద్ధి జరగలేదని మేము తెలియజేస్తున్నాము గరికపాటి పైన ఆదిరెడ్డి అప్పారావు పైన కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్సీ కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇచ్చిన హామీలు మర్చిపోయి మీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను దోపిడీలను మానభంగాలను సమర్ధించుకుంటున్నారే తప్ప రాష్ట్రంలో అభివృద్ధి కనపడలేదని తెలియజేస్తున్నాము ఇకనైనా చంద్రబాబు నాయుడు పాలన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు లబ్ధి చేకూర్చేలా పథకాలు అందించేలా చూడాలని డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ సభ్యులు వి హరి చిన్న ఎల్లప్ప అంజన్నప్ప సదాశివం రవికుమార్ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున సుధాకర వెంకటస్వామి శ్యాముల్ నియోజకవర్గ అధ్యక్షులు రాజన్నఎస్సీ మండల అధ్యక్షులు రామానుజులు రఘు సుందరయ్య విజయ్ వెంకటరమణ పాల్గొన్నారు.

## టీవీ మెకానిక్ ఇక్బాల్ అకాల మృతి తోటి సభ్యుల ఆర్థిక సాయం



**పెద్దమండెం/గుర్రంకొండ మార్చి 25 ప్రభాతవార్త**
టీవీ మెకానిక్ ఇక్బాల్ ఆరోగ్యం సరిలేక వారం రోజుల క్రితం మృతి చెందారు దీంతో తోటి మెకానిక్ సోదరులు విరాళాలు సేకరించి బుధవారం వారి ఇంటికి వెళ్లి పెద్ద మనుషుల సమక్షంలో 21801 రూపాయలు ఆర్థిక సాయం వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. తమ్మళ్ళపల్లి మొలకలచెరువు బి కొత్తకోట మదనపల్లి పీలేరు గుర్రంకొండ తిరుపతి పుంగనూరు పలమనేర్ పెద్దమండెం కు చెందిన మెకానికులు ఆర్థిక సాయం అందించి తమ వంతు సాయంగా అండగా నిలబడ్డారు వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు ఈ కార్యక్రమంలో మెకానికులు భాను దివాకర్ శ్రీనివాసులు ప్రకాష్ సైద్బాషా తోటి మెకానికులు పాల్గొన్నారు.

## వేలం పాట ద్వారా పంచాయతీకి రూ. 11.81లక్షల ఆదాయం



వేల పాటను నిర్వహిస్తున్న అధికారులు

**చౌడేపల్లి, మార్చి 25 ప్రభాతవార్త**
మేజర్ పంచాయతీ చౌడేపల్లిలోని పలు వనరులకు నిర్వహించిన వేలం పాట ద్వారా రూ. 11.81లక్షలు ఆదాయంగా వచ్చినట్లు మదనపల్లి డిఎల్‌పిఓ నాగరాజ తెలిపారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో వారుపు సంత గేటును సంవత్సర కాలం పాటు వసూలు చేసుకొనే హక్కును గిరినాయుడు రూ. 9.90లక్షలు, ప్రైవేటు బస్టాండులో శ్రీరాములు రూ. 1.91లక్షలు హెచ్చుగా పాడి దక్కించుకొన్నారు. డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్, కార్యదర్శి శివకుమార్, పంచాయతీ సిబ్బంది, వేలం పాటదారులు, స్థానికులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కరించండి సారూ..!

### మహిళల వేడుకోలు



సర్పంచును కోరుతున్న మహిళలు

**చౌడేపల్లి, మార్చి 25 ప్రభాతవార్త**
మంచినీరందించి ఆదుకోండి మహాప్రభో అంటూ మహిళలు సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్, పంచాయతీ అధికారులను కోరారు. స్థానిక బత్తలాపురం రోడ్డులో మంచినీటి సమస్య నెలకొనింది. ఆ ప్రాంతానికి సరఫరా చేసే మంచినీటి బోరు సామర్థ్యం తగ్గిందని మహిళలు తెలిపారు. అంతే కాకుండా తమ వీధిలోని చేతిపంపుకు మరమ్మత్తు చేయిస్తే ఉపయోగకరంగా వుంటుందని వారు అధికారులు, పాలకులను విన్నవించుకొన్నారు. మంచినీరందించేలా చర్యలు తీసుకొంటామని ఈ సందర్భంగా సర్పంచు, అధికారులు వారికి హామీ ఇచ్చారు. బత్తలాపురం రోడ్డు మహిళలు పాల్గొన్నారు.

## కొండలరాయుడు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలి

### విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి,మోహన్ రెడ్డి



**సంబేపల్లి , మార్చి 25 ప్రభాత వార్త**
జగన్ ప్రభుత్వంలో ఆలయాలకు పెద్దపీట వేయడం జరిగిందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, హిందూపురం పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి తెలిపారు . సంబేపల్లె మండలం, శెట్టిపల్లె గ్రామం తిమ్మక్కగారిపల్లెలో నూతనంగా నిర్మించిన కొండలరాయుడు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా బుధవారం జరిగిన ప్రధాన పూజా కార్యక్రమాలలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు నిర్వాహకులు గొర్ల ఉపేంద్ర రెడ్డి, రమేష్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి మరియు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, కొండలరాయుడు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కృపాకటాక్షాలు ప్రజలందరికీ లభించాలని ఆకాంక్షించారు.

**ప్రజలు సుభిక్షంగా ఉండాలి: రమేష్ కుమార్ రెడ్డి**
భగవంతుడి దయవల్ల ప్రజలు,రైతులు సుభిక్షంగా ఉండాలని రమేష్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు.భక్తి తోనే ఆధ్యాత్మిక ప్రశాంతత ఉంటుందన్నారు.పూజా కార్యక్రమాలకు విచ్చేసిన భక్తులు, గ్రామ ప్రజలతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,రమేష్ కుమార్ రెడ్డి ఆత్మీయంగా మమేకమయ్యారు.ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా మాట్లాడి ప్రేమానురాగాలు పంచుకున్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులతో కలిసి పాల్గొని వారి అభిమానాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి స్టేట్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు ఆవుల విష్ణు వర్ధన్ రెడ్డి,పుంగనూరు నియోజక వర్గ నాయకులు శ్రీనాథ్ రెడ్డి,అనూష రెడ్డి,సంబేపల్లె మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి,రాయచోటి మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి,వీరబల్లె ఎంపిపి రాజేంద్ర నాథ రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వడ్డీ వెంకట రమణా రెడ్డి,వైఎస్ఆర్ సిపి ఎస్ టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు గుండా సురేంద్ర, మాజీ ఎంపిపి నాగిరెడ్డి, చిన్నమండెం బాబు రెడ్డి, రామాపురం వైస్ ఎంపిపి రవి శంకర్ రెడ్డి ,వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ లు వెంకట రమణ నాయక్, అంచల రామచంద్ర దండు నాగభూషన్ రెడ్డి, ఎంపిటిసి శ్రీధర్ రెడ్డి, నాయకులు వాసుదేవ రెడ్డి, మండల చేనేత విభాగపు అధ్యక్షుడు సహదేవ, తిక్కం ఆనంద రెడ్డి, స్థానిక నాయకులు వాయల్పాటి ఆనంద కుమార్ రెడ్డి,జిల్లా కార్యదర్శి మల్లికార్జున రెడ్డి, లాయర్ శ్రీనివాసులు రెడ్డి, నరసింహా రెడ్డి, కిషోర్ రెడ్డి,శంకరయ్య నాయుడు, జయనారాయణ రెడ్డి, కోట ఆంజనేయులు నాయుడు, ఉమా మహేశ్వర నాయుడు, మహేశ్వర, ఏటా సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గరికి తీవ్ర గాయాలు

**మదనపల్లెక్రైమ్, మార్చి 25 ప్రభాతవార్త.**
అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి కురబలకోట మండలంలో జరిగింది. ఘటనపై ముదివేడు ఎస్ఐ మధురామచంద్రుడు కథనం మేరకు.. కడప పట్టణం, శ్రీనివాసనగర్ కు చెందిన యాసీన్, యశ్వంత్ అనే విద్యార్థులు అంగళ్లులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతూ అంగళ్లులోనే అద్దె రూములో ఉంటున్నారు. సొంత పనిమీద రాత్రి బైకులో మదనపల్లి కు వచ్చారు. పని ముగించుకుని తిరిగి అంగళ్లుకి వెళుతుండగా, చేనేత నగర్ లోని కళ్యాణ మండపం వద్ద జరుగుతున్న వివాహానికి హాజరయ్యేందుకు కనసానివారిపల్లెకు చెందిన వృద్ధుడు గంగుల్ రెడ్డి వెళ్లాడు. ఆ వృద్ధుడు రోడ్డు దాటే క్రమంలో విద్యార్థులు ప్రయాణిస్తున్న బైకు అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులతో పాటు వృద్ధుడు తీవ్రంగా గాయపడగా స్థానికులు వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రతిమ చికిత్స అనంతరం వృద్ధుడు పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించారు.

## ఆలయ దారికి మహర్దశ



**కురబలకోట మార్చి 25 ప్రభాతవార్త.**
కురబలకోట మండలం నంది రెడ్డిగారి పల్లి పంచాయతీ గౌను వారి పల్లి వద్ద శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఆంజనేయ స్వామి గుడి వద్దకు రోడ్డుకు మహర్దశ. ఈ ఆలయల వద్దకు నిత్యము వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పూజల కోసం వస్తుంటారు. అక్కడ గతంలో బండరాళ్లతో ఉండేది. అంతే కాకుండా ఎగుడు దిగుడుగా ఉండేది. మహిళలు పిల్లలు ఆలయాల వద్దకు రావాలంటే అవస్థలు పడేవారు. అంతేకాకుండా నివాసాలు ఉండే ప్రజలు రాకపోకలకు సైతం ఇబ్బందులకు గురయ్యేవారు. ఆ ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతోంది. భక్తులు, అక్కడ నివాస ప్రాంతం ప్రజల సౌకర్యానీ దృష్టిలో ఉంచుకొని కూటమి నాయకులు కురబలకోట మండలం చింతమాకుల పల్లి గ్రామ క్లస్టర్ టిడిపి ఇంచార్జ్ మాజీ ఎంపీపీ మెజారి తిమ్మరాయుడు అధికారులతో చర్చించి నిధులు మంజూరుకు కృషి చేశారు.

## తంబళ్లపల్లెలో చలివేంద్రం ప్రారంభం




**తంబళ్లపల్లె మార్చి 25 ప్రభాతవార్త :**
తంబళ్లపల్లె మండల కేంద్రం క్రాస్ రోడ్ ఆర్టిసి బస్సు షెల్టర్ లో బుధవారం మండల డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ చలివేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృశ్య ప్రయాణికులు, ప్రజలు సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు జరిగిందని ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అదేవిధంగా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, పద్మావతి, భాస్కర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా



**పులివెందుల, మార్చి 26, ప్రభాత వార్త :**
కార్యకర్తల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని వైయస్సార్ కడప జిల్లా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పులివెందుల పట్టణంలోని స్థానిక జగన్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను వీలు అయినంత వరకు పరిస్కరిస్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### రజత కాంతులతో దగదగ

# మెరిసిపోతున్న జగదభి రామయ్య కోవెల

ఆలయానికి వచ్చిన భక్తులు వేడిమి తాకిడి తట్టుకునేందుకు ఆలయంలో జర్మనీ షెడ్లు ఏర్పాటు చేశారు. సీతారామ కళ్యాణ వేదిక పనులన్నీ పూర్తి చేశారు. వెన్నెలను తలపించే విధంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో భక్తుల్లో ఆధ్యాత్మిక భావనలు ప్రసరింప చేసే విధంగా ఏర్పాటు చేశారు. ఆనందించే విధంగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దివ్య అనుభూతి అందిస్తున్నాయి. ఆలయం లోపల వెలుపల పరిసరాలు, టీటీడీ భవనం, వాహన మండపం, మాడు వీధులు, ఉద్యానవనం, పుష్కరిణి అందంగా అలంకరించడం జరిగింది. ఒంటిమిట్ట నుండి మాధవరం వరకు మార్గమంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు.30 కి పైగా దేవతామూర్తుల బొమ్మలు, 70 కి పైగా ప్రత్యేక డిజైన్ బొమ్మలు ,అద్భుత ఇమ్యూనికేషన్ బోర్డులు అమర్చారు. శ్రీరామ పట్టాభిషేకం, శ్రీరామ కళ్యాణం, అయోధ్య రాముడు, గరుడ, గజవాహనంపై స్వామి వారు, రామబాణం, పద్మనాభ స్వామి ,అమ్మవారు శ్రీ ప్రముఖ చిత్రం, శ్రీరాముడు శబరి, దశావతారాలు, అష్టలక్ష్మ్ములు వంటి చిత్రాలు విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేయడం జరిగింది.20వేల సీరియల్ సెట్లు,10 వేల ఫ్లడ్ లైట్లు, 500 రంగు లైట్లు, 40 జనరేటర్లు వివిధ రకాల తోరణాలతో కట్టుకునే విధంగా అమరిక చేయడం జరిగింది. ఏప్రిల్ 01వ తేదీన నిర్వహించే సీతారామ కళ్యాణ ఉత్సవానికి వేల సంఖ్యలో తరలివస్తున్నారు. ఇందు నిమిత్తం కళ్యాణ వేదిక వద్ద భక్తులకు కావలసిన మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేయడం జరిగింది. వేదిక వద్ద పార్కింగ్ ప్రదేశాలు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ కళ్యాణాన్ని వీక్షించేందుకు 24 ఎల్ఈడి డిస్ప్లే బోర్డులు అమర్చడం జరిగింది. సీతారామ పరిణయాన్ని కనులారా వీక్షి స్తూ తన్మయత్వంలో భక్తులు గడపాలని టీటీడీ వారు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగింది. టీటీడీ పరిపాలకులు రజత కాంతులతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు బ్రహ్మోత్సవ శోభ తెస్తున్నాయి.జగదభిరాముని బ్రహ్మోత్సవాలు టీటీడీ పర్యవేక్షణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్విఘ్నంగా జరగాలని సీతారామున్ని కోరుకుందాం.







**IN THE COURT OF THE HON'BLE III SENIOR CIVIL JUDGE RANGA REDDY DIST, AT . L.B.NAGAR**
**O.S.No. 730 of 2025**
Between:-
**Sri Renuka Homes (P) Ltd** ...Plaintiff
And
**Basaveni Narayana Rao and Others** ...Defendants
To
**1. Pochana Srinivasulu Reddy,** S/o. Balakonda Reddy, Aged about 46 years, Occ: Business, R/o. Modampally Street, Proddatur, Kadapa District **...Defendant No.4**
Take notice that the above named Plaintiff filed the above Suit against you for Declaration and Declare the Sale deeds as null and void and the said suit is posted to **10-04-2026** for your appearance. Hence you are hereby directed to appear either in person or through an Advocate on the said date i.e. **10-04-2026 at 10.30 a.m.** before the above Court, failing which the matter will be decided basing on the documents available on record.
(BY ORDER OF COURT)
**Sd/- K.RAJA REDDY**
**A.V. SUJITH KUMAR**
**Advocates**
**Counsel for the Plaintiff**
401, Gayatri Towers, Near Victoria Metro station 'D' Steps, Kothapet, Hyderabad.

# నీటి వనరులను సంరక్షణ మనందరి భాధ్యత






**వైవీయూ, మార్చి 26, ప్రభాతవార్త:**
నీటి వనరులను కాపాడుకోవలసిన భాధ్యత మన అందరిపై ఉందని యోగి వేమన విద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలోని జియాలజీ శాఖ ఆధ్వర్యంలో ఖివరల్డ్ వాటర్ డే 2026 సందర్భంగా నీటి యాజమాన్య విధానం అనే అంశంపై అవగాహన కార్యక్రమం విశ్వవిద్యాలయంలో ని అన్నమాచార్య సేనెట్ హాల్లో నిర్వహించారు. అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ ఉపలపతి మాట్లాడుతూ నీటి సంరక్షణ మనం అమలు చేస్తూనే సమాజాన్ని చైతన్యం చేయవలసిన గురుతుల బాధ్యత విశ్వవిద్యాలయం పై ఉందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీ ఆచార్యులు ఎ.సి. నారాయణ హాజరై క్లైమేట్ చేంజ్: వాటర్ రిసోర్స్ మేనేజ్మెంట్ " అనే అంశం కీలకోపన్యాసం ఇచ్చారు. జాగ్రత్త పడక పోతే భవిష్యత్తులో ఉత్పన్నమయ్యే నీటి సమస్యల గురించి అవగాహన కల్పించారు. నీటి వనరులు కొరత, నీటి సంరక్షణ విధానాలు, పద్ధతులు, నీటి వనరులు నిర్వహణలో మహిళల పాత్ర,. నీటి నిల్వలను కాపాడుకోవడంలో ప్రజల భాగస్వామ్యం మున్నగు వాటి మీద విస్తృత అవగాహన కల్పించారు. విశ్వవిద్యాలయ బాధ్య కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు టి.శ్రీనివాస్ నీటి ఆవశ్యకత మన బాధ్యత గురించి వివరించారు. కార్యక్రమం కన్వీనర్ భూ విజ్ఞాన శాస్త్ర శాఖ ఆచార్యులు వంగల సునీత కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమ ఉద్దేశాన్ని ( థీమ్) తెలిపారు. చివరగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ విద్యార్థులు అధ్యాపకులు సిబ్బందితో " జల ప్రతిజ్ఞ"చేయించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక బృందం ఆచార్య కె.రఘుబాబు, ఆచార్య ఎన్.జయరాజు,డా.ఎస్ శ్రీనివాసగౌడ్, డా.ఆర్. సిద్ధిరాజు, డా.ఇ.బాలాజి, విద్యార్థులు, స్కాలర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్ రాజు

**రాజంపేట, మార్చి26 ప్రభాతవార్త**
రాజంపేట మండలం మదన గోపాలపురం పంచాయతీలోని శ్రీ పంచముఖ వినాయక స్వామి గుడి దగ్గర నుండి సిద్దేశ్వర కాలనీ వరకు సిమెంట్ రోడ్డు కు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు గురువారం భూమి పూజ చేశారు. డీఎంఎఫ్ నిధుల నుంచి సిమెంట్ రోడ్డుకు మంజూరు అయిన టువంటి 39 లక్షల రూపాయలకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. నాణ్యతతో పనులు చేపడతామని పేర్కొన్నారు. భూమి పూజ కార్యక్రమంలో పార్టీ యూనిట్ ఇంచార్జ్ జనార్దన్ రాజు, బూత్ కన్వీనర్ గూడూరు శివ, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు



**సిద్ధవటం మార్చి 26 ప్రభాతవార్త**
మండలంలోని భాకరాపేట సమీపాన ఉన్న 11వ పోలీస్ పటాలయంలో వెలసిన శ్రీ దుర్గమ్మ ఆలయంలో 30 అడుగుల నూతన ధ్వజస్తంభం ప్రతిష్టించడానికి శుక్రవారం భాకరాపేట గ్రామం నుండి భాజా భజంత్రీల మధ్య ఊరేగింపుగా బెటాలియన్ పోలీసులు తీసుకొనివచ్చారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండర్ ప్రసాద్ స్థానిక సర్పంచ్ ప్రతినిధి తుర్ర ప్రతాప్ నాయుడు ఆర్ఐలు ఆర్ఎస్ఐలు బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

## ముందస్తు శ్రీరామనవమి వేడుకలు



**వేంపల్లె మార్చి 26 ప్రభాతవార్త**
స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు శ్రీరామ్ నగర్ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బి చక్రపాణి రెడ్డి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలను నిర్వహించారు. ముందుగా కరస్పాండెంట్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల ప్రాంగణంలో శ్రీరామనవమి ఉట్టిపడేలా అలంకరించడంతో పండగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తి గీతాలు ఆలపించి శ్రీరామనవమి ప్రాముఖ్యతను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. శ్రీరాముడు, సీత లవకుశ వేషాధారణలో వచ్చిన చిన్నారులు అందరిని ఆకట్టుకున్నారు. అనంత అనంతరం కరస్పాండెంట్ మాట్లాడుతూ శ్రీరాముడు ధర్మానికి ప్రతీక, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సత్యం నీతి విధేయతలను జీవితంలో ఆచరించాలని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. శ్రీరామనవమి పర్వదినం యొక్క ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించి సత్యం, నియమం భక్తి వంటి విలువలను జీవితంలో ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### విజయనగరం జిల్లా కలెక్టర్‌కు
## మన కడప ఘన గడప గేయమాలిక అందజేత

**ప్రొద్దుటూరు అర్బన్ , మార్చి 26, ప్రభాత వార్త :**



స్థానిక సూపర్ బజార్ రోడ్డు లోని స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు, శివోహం అన్న ప్రసాద సేవా సంఘం అధ్యక్షులు శివాలయం మాజీ చైర్మన్ శెట్టిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్వగృహానికి గురువారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా చాపాడు మండలం నక్కల దిన్నె గ్రామంలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొనుటకు విచ్చేసిన విజయనగరం జిల్లా కలెక్టర్ శెట్టిపల్లి రామసుందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సగౌరవంగా సత్కరించి తాను స్వయంగా రచించి స్వరకల్పన కూర్చి గానం చేసిన మన కడప ఘన గడప గేయ రాగమాలికను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పర్యావరణ మిత్ర రచయిత ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఇన్ టాక్ లైఫ్ మెంబర్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి(గవెరె) అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అరబిందో ఇంటిగ్రల్ హైస్కూల్ కరస్పాండెంట్ బి కాశీ ప్రసాద్ రెడ్డి మురుకుటి సూర్యనారాయణ రెడ్డి సేవా ట్రస్ట్ అధ్యక్షులు ఎం సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంల గోడౌన్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కడప, మార్చి 26 ప్రభాతవార్త :**
గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ భవన సముదాయంలోని ఈవీఎం గోడౌన్లను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా.. ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను తనిఖీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటపతి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఈ. శ్రీకాంత్ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు లక్ష్మణ్ రావు(బిజెపి), జనార్దన్, జబీవుల్లా (తెదేపా), గౌస్ పీర్ (కాంగ్రెస్), ఫయాజ్ అహ్మద్(వైసిపి) డా.శ్రీనివాసులు (ఆప్), విశ్వనాథ్ (జేఎస్పీ) పాల్గొన్నారు.

### అగస్తేశ్వరాలయంలో ప్రారంభమైన
## శ్రీ రామనవమి ఉత్సవాలు



**ప్రొద్దుటూరు అర్బన్,మార్చి 26, ప్రభాత వార్త :**
ప్రొద్దుటూరు నడిబొడ్డున వున్న అగస్త్యేశ్వరాలయంలో గురువారం నుంచి రామనవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు ఉదయం కార్యనిర్వహణాధికారి కే.వీ. రమణ, ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో గోపూజతో ప్రారంభమై విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవాచనం, పంచగవ్యం, రక్షాబంధనం, అంకురార్పణ పరివార దేవత ఆవాహన శ్రీ అభయ వరద సీతారామచంద్ర స్వామి వారి కలశ స్థాపనాది పూజలు, సాయంత్రం పరివార శ్రీ అభయ వరద సీతారామచంద్ర స్వామి వారి కలశ పూజలు అగ్ని ప్రతిష్టాపన దీక్షా హోమములు లఘు పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. రెండవ రోజు శ్రీరామనవమి విశేష పర్వదినం కనుక స్వామివారికి తెల్లవారుజామున నుండి విశేష పూజలు మండప పూజలు, దీక్షాహోమాలు, ఉదయం 10 గంటలకు శ్రీ అభయ వరద సీత రామచంద్ర స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

### క్రికెట్ బెట్టింగ్, మట్కా
## జూద కార్యకలాపాలపై కఠిన చర్యలు

- నేర చరిత్ర ఉన్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా
- బెట్టింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా కేసుల్లోని వారికి కౌన్సెలింగ్
- ఏఎస్పీ విబు కృష్ణ



**ప్రొద్దుటూరు క్రైం, మార్చి 26, ప్రభాతవార్త:**
క్రికెట్ బెట్టింగ్, మట్కా, జూద కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని ప్రొద్దుటూరు ఏఎస్పీ విభు కృష్ణ తెలిపారు. గురువారం ఆయన బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా కేసుల్లో ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. యువత బెట్టింగ్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పునరావృతంగా క్రికెట్ బెట్టింగ్, మట్కా లేదా జూద కార్యకలాపాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ అమలు చేసి జిల్లా బహిష్కరణకు సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల పట్ల ఆకర్శితులైతే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. అటువంటి యాప్‌లపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్, మట్కా లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే 9121100585, 9121100586, 9121100590, 9121100597, 9121100589 నంబర్లకు తెలియజేసి సహకరించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

# అంకురార్పణతో శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- వేదమంత్రాల నడుమ ఉత్సవాలకు నాంది
- పాంచరాత్ర ఆగమం ప్రకారం అర్చకుల పూజా కార్యక్రమాలు
- అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ సిబ్బంది
- అధిక సంఖ్యలో ఆలయానికి భక్తులు హాజరు



**ఒంటిమిట్ట మార్చి.26. ప్రభాతవార్త**
పాంచ రాత్ర ఆగమం ప్రకారం వైష్ణవ సంప్రదాయ పద్ధతిలో టీటీడీ ఆధ్వర్యంలో అంకురార్పణ కార్యక్రమం నుంచి అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం నాంది పలకడం జరిగింది. ముందుగా ఆలయ పర్యవేక్షకులు రామాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించడం జరిగింది. అనంతరం ఆలయ అర్చకులు శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను అద్భుతంగా అలంకరించి ఆలయ మధ్యమండపంలో ఆసీనులను గావించారు. సాంప్రదాయబద్ధంగా వేద మంత్రాలతో విశ్వక్సేనుని ఆరాధన, ఆలయ స్వస్తి పుణ్యావాచనము, కలిస పూజ, కలశ ప్రతిష్ట, వాసుదేవ పూజ, కంకణ ధారణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ లోపలి ఈశాన్య భాగంలో నాగుల పుట్టకు చీర సారె నొసంగి ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్ను సేకరించడం జరిగింది. వెలుపలికి తీసిన పుట్టమన్ను మోసుకొని భాజా భజంత్రీలతో ఆలయంలోకి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు నాంది పలకడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి రావడం జరిగింది. అర్చకులు నిర్వహించే పూజల్లో పాల్గొని అంకురార్పణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, బాలరాజు, అనంతయ్య, నవీన్ ఇతరులు పాల్గొన్నారు.





## రామాలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

**పులివెందుల, మార్చి 26, ప్రభాతవార్త :**
పులివెందులలోని స్థానిక వైఎస్ జగన్ క్యాంప్ ఆఫీస్ సమీపంలో ఉన్న వైఎస్ జయమ్మ కాలనీలో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి జై హిందుస్థాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వంగల గోవర్ధన్ రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి కృషి చేస్తున్న కాటె నరసింహకు ఈ మొత్తాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి నిధుల కొరత ఉందని హిందువులు స్వచ్ఛందంగా ఆర్థిక సాయం చేసి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేసిన వంగల గోవర్ధన్ రెడ్డికి ఆలయ నిర్మాణ కన్వీనర్ కాటె నరసింహ కృతజ్ఞతలు తెలియజేశారు.

## అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- యుద్ధ ప్రభావం, అకాల వర్షాలతో తీవ్ర నష్టం
- టన్ను 15 వేలతో ప్రభుత్వం కొనుగోలు చేయాలి
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి



**పులివెందుల మార్చి 26 ప్రభాతవార్త :**
పులివెందుల ప్రాంతం నల్లపు రెడ్డిగారి పల్లె లో అరటి తోటలను గురువారం ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధ ప్రభావం వల్ల మార్కెట్‌లో ధరలు పడిపోవడం, అకాల వర్షాల కారణంగా పంటలు నష్ట పోయిన అరటి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రపంచ వ్యాప్తంగా జరిగే యుద్ధాలు వాణిజ్య వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయన్నారు దిగుమతులు, ఎగుమతులు మందగించడం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌లో అస్థిరత ఏర్పడుతుందన్నారు జిల్లాలో ప్రధానంగా పులివెందుల ప్రాంతంలో వేల ఎకరాలలో అరటి సాగు చేస్తున్నారన్నారు అయితే యుద్ధ ప్రభావంతో ధరలు పూర్తిగా తగ్గిపోయాయని దానికి తోడు అకాల వర్షాలతో అరటి చెట్లు కూలిపోవడం, గెలలు విరిగిపోవడం తో అరటిపంట పూర్తిగా దెబ్బతినిందన్నారు. కంటికి రెప్పలా చూసుకుని తీరా పంట చేతికొచ్చే సమయంలో ధరల లేకపోవడం, పంట నష్టం జరగడంతో అరటి రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని అరటి రైతులకు తక్షణ పరిహారం అందించడం అత్యవసరమన్నారు. పంట నష్టాన్ని లెక్కించి ప్రభుత్వం తక్షణం అరటి రైతులను ఆదుకోవాలని, అరటి పంటను టన్ను 15 వేలతో ప్రభుత్వం కొనుగోలు చేసి అరటి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పర్యటన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జి చంద్రశేఖర్ రామ్మోహన్ మనోహర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ ప్రజా సంఘాల నాయకులు చాంద్ భాషా జకరయ్య రవి సుమంత్ శివకుమార్ గఫూర్ మహిళా సంఘం నాయకురాలు రాజమణి ఐఎన్ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

### కన్నుల పండుగగా శ్రీ బండెమ్మ
## అమ్మవారి రథోత్సవం

**రామసముద్రం,మార్చి26 ప్రభాత వార్త**
రామసముద్రం మండలంలోని గజ్జలవారిపల్లె గ్రామంలో గురువారం శ్రీ బండెమ్మ అమ్మవారి రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు ఆధ్వర్యంలో ఆలయపూజారి అమ్మ వారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి,తేరులో కొలువు ఉంచి పురవీధులలో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.అమ్మ వారి రథోత్సవం తిలకించడానికి చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మ వారికి హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు,అమ్మ వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.రథోత్సవానికి తిలకించడానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నదాణం,మజ్జిగ,పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు,ప్రజల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.రథోత్సవంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డిఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తో బందో బస్త్ నిర్వహించారు.

## డాబాలో ఎల్పిజి గ్యాస్
## సిలిండర్లు పట్టుకున్న విజిలెన్స్ అధికారులు



**యర్రగుంట్ల: మార్చి 26: ప్రభాతవార్త :**
పట్టణ పరిధిలోని కడప రోడ్డులో చందమామ ఫ్యామిలీ డాబాలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమంగా వాడుతున్న ఎల్పిజి గ్యాస్ సిలిండర్లను గురువారం సీజ్ చేయడం జరిగింది. విజిలెన్స్ ఏవో లక్ష్మణ్ మాట్లాడుతూ ఇండ్లకు వాడే గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తుండడంతో ఐదు సిలిండర్లను సీజ్ చేశామన్నారు. డాబా యాజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజ్ చేసిన సిలిండర్లను స్థానిక విజయ్ సారధి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీకి పంపడం జరిగింది అన్నారు. అక్రమంగా ఎవరైనా ఇంటి గ్యాస్‌ను దుకాణాలలో వినియోగిస్తున్నట్లయితే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

## శ్రీరామనవమి వేడుకలకు శిల్పారామం సిద్ధం

**పులివెందుల, మార్చి 26, ప్రభాతవార్త :**
శ్రీరామనవమి సందర్భంగా పులివెందుల శిల్పారామంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి తెలిపారు. మార్చి 27వ తేదీశుక్రవారం సాయంత్రం 5:30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాలు జరుగను న్నాయి.ఈ సందర్భంగా ఎస్.కె ఫిలిం స్టూడియో, పులివెందుల ఆధ్వర్యంలో మాస్టర్ శ్రీ శర్వాన్ కుమార్ శిక్షణలో చిన్నారులు శాస్త్రీయ మరియు జానపద నృత్యా లను ప్రదర్శించ నున్నారు. ఈ కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రత్యేకంగా సిద్ధం చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు .శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించు కొని నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక వేడుకలకు పులివెందుల పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శిల్పారామం పరిపాలన అధికారి కోరారు








